క్లుప్తంగా

ఎస్‌ఏ-2 పరీక్షలు తనిఖీ


పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఎస్‌ఏ-2 పరీక్షలను మంగళవారం ఎంఈఓ మస్తాన్‌వలి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం రాగి జావ, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. హెచ్‌ఎంలు నాగయ్య, సర్దార్ పాల్గొన్నారు.

మాతమ్మకు పొంగళ్లు


మాతమ్మ అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

చేజర్ల: మండలంలోని చిత్తలూరు కాలనీలో మాతమ్మకు మంగళవారం సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. మహిళలు బుట్టల్లో పొంగళ్ల సామగ్రిని తీసుకుని ఊరేగింపుగా మాతమ్మ గుడికి చేరుకుని అక్కడే పొంగళ్లు పెట్టారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం తనిఖీ


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య అధికారి ఖాదర్‌వలి

చేజర్ల: మండలంలోని మాముడూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్య అధికారి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి ఖాదర్‌వలి మంగళవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

సంగం: సంగంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో చేరేందుకు అర్హులైన 10వ తరగతి ఉత్తీర్ణులైన వారి వద్ద నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఏడుకొండలు తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, సంగం ఐటీఐలో ఫిట్టర్ సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 9వ తేదీ జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 9866720544, 9963950604 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రామ సభ వాయిదా

చేజర్ల: మండలంలోని నాగులవెలటూరులో మంగళవారం జరగాల్సిన గ్రామ సభను వాయిదా వేశారు. అనివార్య కారణాలతో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

కిస్తీపురంలో పశు వైద్యశిబిరం


రైతులకు హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని ఏ.కిస్తీపురంలో మంగళవారం పశుపోషకులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం జరిగింది. పశు వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు పశుపోషకులకు పలు సూచనలు తెలియజేశారు. ఆరోగ్య హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. పశు కిసాన్ క్రెడిట్ లోన్లు గురించి వివరించారు. పశువులకు నట్టల నివారణ మందులు తాగించి గొంతు వాపు టీకాలు వేశారు.

గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి సహకరించండి



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబు పెచ్చులూడి పాఠకులు, విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నూతన భవన నిర్మాణానికి సహకరించాలని లైబ్రేరియన్ శ్రీనివాసరాజు ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డికి విన్నవించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎంపీపీ తెలిపారు.


కేతామన్నేరువాగు బ్రిడ్జి మధ్యలో ఏర్పడ్డ గుంతలో ఇరుక్కుపోయిన లారీ టైరు


కేతామన్నేరువాగు వంతెనపై స్లాబు మధ్య ఏర్పడిన మరో గుంత వద్ద ద్విచక్రవాహనదారుల ప్రాణాంతక ప్రయాణం

ఆదమరిస్తే అంతే!

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):

కృష్ణపట్నంపోర్టు–బళ్లారి మార్గాన్ని అనుసంధానం చేస్తూ నిర్మించిన 67వ నంబరు జాతీయ రహదారిపై అనేక మలుపుల్లో మృత్యుఘంటికలు మోగిస్తున్నాయి. ప్రధానంగా మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద కేతామన్నేరు వాగుపై నిర్మించిన హైలెవల్ వంతెన వాహనదారులు, ప్రయాణికులకు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా మారింది. రోజురోజుకు వంతెనపై స్లాబు దెబ్బతిని గుంతలు ఏర్పడి చువ్వలు పైకితేలి ప్రాణాంతకంగా మారింది. వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. బద్వేల్ నుంచి నెల్లూరు మధ్యలో నిత్యం రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు వణికిపోతున్నారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో హైలెవల్ వంతెన ఊగిపోతున్నట్లుగా ఉండడంతో వాహనదారులు హడలిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు, కారులో ప్రయాణించే వారు బ్రిడ్జిపై ఉన్న గోతులు తెలియక వేగంగా ప్రయాణించే సమయంలో టైర్లు పంక్చరై వాహనాల కట్టర్లు విరిగిపోయి నానా ఇక్కట్ల పాలవుతున్నారు. జాతీయ రహదారుల శాఖ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లుగా కూడా లేకపోవడం గమనార్హం. ఈ ప్రాణాంతక వంతెనపై జరగాని ఘోరం జరిగితే ప్రమాద స్థాయి ఊహకందకుండా ఉంటుందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. తక్షణమే స్పందించి ఈ వంతెనపై రాకపోకలను క్రమబద్ధీకరించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


కేతామన్నేరు హైలెవల్ బ్రిడ్జి వంతెన మధ్యలో ఏర్పడ్డ గుంత


కేతామన్నేరువాగు బ్రిడ్జిపై గుంతల్లో పడి విరిగిపోయిన లారీ కట్టర్లను సరిచూసుకుంటున్న లారీ డ్రైవర్

నిర్లక్ష్యానికి పరాకాష్ట

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుట అవుట్ వే (బయటకు వెళ్లే మార్గం) వద్ద కల్వర్టు పునర్నిర్మించి మూడు నెలలు అవుతున్నా.. రాకపోకలు పునరుద్ధరించకుండా కంచె వేశారు. కల్వర్టు ఏడాదిన్నరగా శిథిలావస్థకు చేరుకుని రంధ్రాలు పడింది. ఈ విషయమై ప్రజలు, ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. ఎట్టకేలకు మూడు నెలల క్రితం దెబ్బతిన్న కల్వర్టు స్థానంలో కొత్త కల్వర్టు నిర్మించారు. 15 రోజులకే క్యూరింగ్ కూడా పూర్తయింది. అయితే రెండున్నర నెలలుగా ఆ మార్గాన్ని బస్సుల రాకపోకలు సాగించేందుకు అనువుగా చేయాల్సి ఉండగా ముళ్లకంప, మట్టి దిబ్బలు ఇరువైపులా వేసిన సంబంధిత ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఈ ద్వారం పరిసరాల్లోనే ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, విద్యాలయాలు, తదితర అవసరాల నిమిత్తం నిత్యం సంచరించే ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతనంగా నిర్మించిన కల్వర్టును ప్రజోపయోగం చేయాలని సర్వత్రా కోరుతున్నారు.


ఆర్టీసీ డిపో ప్రధాన ద్వారం వద్ద మూతవేసి నూతన కల్వర్టు

సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్

• లయన్స్‌క్లబ్ గవర్నర్ వై.నాగేశ్వరరావు


ఏకలవ్యనగర్‌లో పాఠశాల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గవర్నర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ 316డి జిల్లా గవర్నర్ వై నాగేశ్వరరావు అన్నారు. ఆత్మకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత బైపాస్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై లయన్స్ క్లబ్ బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను చూసి పలువురు స్ఫూర్తి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ సెక్రటరీ, ట్రెజరర్, రీజనల్ చైర్మన్, ఆత్మకూరు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు: భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం ప్రభుత్వం చూపబోతోందని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.మల్లికార్జున అన్నారు. మంగళవారం మండలంలోని తూర్పురొంపిదొడ్లలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎవరికైనా భూమి లేకపోయినా, భూములకు సంబంధించి ఏవైనా సమస్యలున్నా అర్జీలు ఇస్తే పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. వీఆర్వో నరసింహారావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా


రోగులకు పంపిణీ చేసే జగనన్న ఆరోగ్య సురక్ష పుస్తకాలన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• వైద్య సేవల రూపాన్నే మార్చేస్తున్న సీఎం జగనన్న
• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రతి కుటుంబానికి ఆరోగ్య భరోసా కల్పించేందుకు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రతి ఇంటా ఆరోగ్య రక్షణ కోసమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. దగదర్తి మండలం చెన్నూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 45 రోజుల పాటు జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ వైద్య సేవల్లో నాణ్యత పెంచి ప్రజలకు దగ్గర చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య సేవల రూపాన్నే మార్చేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. గ్రామీణ స్థాయి నుంచే మెరుగైన వైద్య సదుపాయాలు అందించే దిశగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆస్పత్రులకు పంపనున్నట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెద్ద ఎత్తున ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, పేదవాడి ఆరోగ్యానికి ఎంత ఖర్చైనా భరిస్తుందని తెలుపుతూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేశారన్నారు. వైద్య సిబ్బంది రోగులను జల్లెడ పట్టి సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలకు పెద్ద పీట

• ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి


నూతన సర్పంచ్ చేరెడ్డి ప్రభావతిని సన్మానిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు, నాయకులు

ఆత్మకూరురూరల్: సచివాలయాల స్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఇతర ప్రాధాన్యతాంశాలు పరిగణనలోకి తీసుకుని చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం రికార్డ్ స్థాయిలో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్షేత్రస్థాయి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో తనదైన ప్రత్యేక శైలిలో పని చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష, పింఛన్ల మంజూరు, రెవెన్యూ సదస్సులు, తదితర అంశాల్లో విక్రమ్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో వేలాది సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష దేశంలోనే మన రాష్ట్రంలో ప్రత్యేకంగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నిరుపేదలు సైతం కార్పొరేట్ వైద్యం పొందేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుందన్నారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ వల్ల పరిపాలన యావత్తు ప్రజల వద్దకు చేరిందన్నారు. గృహ నిర్మాణశాఖ అర్హులందరికీ ఇళ్లు నిర్మించేందుకు సిద్ధంగా ఉందని, సొంత ఇంటి పట్టా కలిగిన వారు ఈ అవకాశాన్ని సత్వరమే సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇరిగేషన్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈలు నయోమి, ఖాదర్ మస్తాన్, శరత్, శరత్‌చంద్ర, వంగల్లు వెంకటేశ్వర్లు తమ శాఖల పురోగతిని వివరించారు. ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఉద్దాల పెంచలరావు, కంభంశెట్టి ప్రమీల, వ్యవసాయ అధికారి కిషోర్, ఎంఈఓ నజీర్, ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ అనూష, పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఖాసీం సా, పెమ్మసాని వేణమ్మ, గడ్డం సుచిత్ర, సర్పంచ్‌లు చెలిక రమా, సూరం ప్రసాద్‌రెడ్డి, సోమవరపు వెంకట రమణారెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాముదూరు నరసింహులు, పట్టెడ చంద్రశేఖర్, రామిరెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన సర్పంచ్‌కి సన్మానం

చెర్లోయడవల్లి గ్రామ పంచాయతీకి ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా నూతన సర్పంచ్‌గా ఎన్నికైన చేరెడ్డి ప్రభావతిని ఈ సందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

అప్పసముద్రంలో దరఖాస్తుల స్వీకరణ

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. భూమి లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వీఆర్వో వెంకట్ మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూములు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య నిపుణులు అక్కడికక్కడే ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయడంతో పాటు చికిత్స, మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన రోగులను ఆరోగ్యశ్రీ పథకం కింద సిఫారసు చేశారు.


బిట్రగుంట: బోగోలు–2 సచివాలయ పరిధిలో మందుల కిట్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వీరరఘు, ఎంపీడీఓ సుబ్బారావు, సర్పంచ్ పందిపాటి అనిత, ఎంపీటీసీ మందా కౌసల్య, మండల కోఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్ తదితరులు


కావలి: ఆముదాలదిన్నెలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అందజేశారు. సర్పంచ్ ఉడా బ్రహ్మానందం, ఏఎంసీ చైర్మన్ ప్రసాద్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు తదితరులు


ఆత్మకూరురూరల్ : మర్రిపాడు మండలం సింగనపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించి మాట్లాడుతున్న గంగవరపు శ్రీనివాసులు నాయుడు, ఎంపీడీఓ నాగమణి, వైద్యాధికారి విష్ణు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ హజరత్‌రెడ్డి తదితరులు


ఏఎస్‌పేట: మండలం జమ్మవరంలో జగనన్న ఆరోగ్య సురక్షను ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డితో కలిసి జేసీఎస్ కన్వీనర్ రమేష్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ సురేష్‌బాబు, ఎంపీటీసీ సుశీలమ్మ


ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ డీ.ఈశ్వరమ్మ, డీటీ ఫాజిహా, ఈఓపీఆర్డీ మల్లికార్జున, వైద్యాధికారిణి శివకల్పన శకునాలపల్లి, తిరుమలాపురం సర్పంచ్‌లు కె.వెంకటేశ్వరరెడ్డి, కె.కృష్ణ తదితరులు


చేజర్ల: మాముడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, సర్పంచ్ చిన్నయ్య, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, వైద్యులు మెహతాబ్, నవీన్, మేకపాటి దీప్తి, రాజేష్


వరికుంటపాడు: వేంపాడులో జగనన్న ఆరోగ్య సురక్షను ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ ప్రారంభించారు. కందుకూరు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ప్రియంవద పరిశీలించారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీదేవి, వైద్యాధికారులు ఆయేషా, కరిష్మా, భాస్కరరావు, దిలీప్, కోటేశ్వరరావు, భారతి, సర్పంచ్ టి.విజయమ్మ తదితరులు


దుత్తలూరు: మహిళకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, సర్పంచ్‌లు బీబీజాన్, మీసాల సుబ్బరాయుడు, తహసీల్దార్ రవీంద్రబాబు, ఎంపీడీఓ సాయిప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు


అల్లూరు: ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య సురక్ష కిట్‌ను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అల్లూరు పట్టణాధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్ తదితరులు


చేజర్ల: అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో జేసీఎస్ కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంపీడీఓ మధుసూదనరావు, సర్పంచ్ ఎస్.లక్ష్మమ్మ, వైద్యులు అవినాష్, సాయిశ్వేత, వరలక్ష్మి, అశోక్

సీతారామపురం: బిట్–2 సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ సుధాకర్ బాబు, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య, సర్పంచ్ కె.భాగ్యకుమారి



నా భూమి-నా దేశం ర్యాలీ



ఆత్మకూరురూరల్: భారత స్వాతంత్య్ర ఉద్యమంలో అసువులు బాసిన స్వాతంత్య్ర సమరయోధులకు దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీరులకు నివాళులు అర్పించడం కోసమే ఢిల్లీలోని శక్తిపథ్‌లో స్తూపం నిర్మిస్తుందని జిల్లా యువజన సంక్షేమాధికారి ఎ మహేంద్ర రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మేరీ మట్టి–మేరీ దేశ్ కార్యక్రమంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని అమృత్ కలశంలో నింపి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి, ఏఓ శ్రీనివాసులు, ఉపాధి హామీ ఏపీఓ శిరీష, వైద్యాధికారి డాక్టర్ అనూష, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నిరసన

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డిపో ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ డిపో కార్యదర్శి భాస్కర్, ప్రచార కార్యదర్శి మహమ్మద్ అలీ మాట్లాడుతూ కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను డిపోకు తెప్పించి అన్ని పరికరాలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాష్ కౌంటర్ వద్ద గది శ్లాబు మరమ్మతులు చేయించాలని, నగదు నిల్వలు సౌకర్యవంతంగా చేసుకోవడానికి అవసరమైన టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెంచలరావు, చెన్నయ్య, నరసింహులు, తాతారావు, ఖాజారంతుల్లా, దిలీప్‌కుమార్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.